నమస్తే తెలంగాణ

కామారెడ్డి

5 | నిజామాబాద్, గురువారం 17 ఏప్రిల్ 2025 | KAMAREDDY


# కాంగ్రెస్, ఖాకీల దమనకాండ!

గులాబీ శ్రేణులపై దౌర్జన్యం

- ఉద్రిక్తంగా మారిన కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ
- తులం బంగారంపై ప్రశ్నించిన మాజీ మంత్రి వేముల
- సమాధానం చెప్పలేక పోయిన మంత్రి జూపల్లి
- అరుపులు, కేకలతో అడ్డుకున్న కాంగ్రెస్ శ్రేణులు
- వారిని అదుపు చేయకుండా గమ్మునున్న పోలీసులు
- ప్రశ్నించిన బీఆర్ఎస్ శ్రేణులపై రెచ్చిపోయిన ఖాకీలు
- బూట్లతో తంతూ, లాఠీలతో కుళ్లబొడిచిన పోలీసులు
- లాఠీచార్జిని నిరసిస్తూ వేముల రాస్తారోకో

## మొదటి నుంచే ఉద్రిక్తత..

బాల్కొండ నియోజకవర్గంలోని సుమారు 800 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని భీమ్‌గల్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం ఏర్పాటు చేశారు. ప్రొటోకాల్ ప్రకారం స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తన అనుచరులతో కలిసి అక్కడికి చేరుకున్నారు. అయితే, ఒక్కరినే లోనికి అనుమతిస్తామని, మిగతా వారిని పంపించబోమని పోలీసులు గేటు వద్దే ఎమ్మెల్యేను అడ్డుకున్నారు. అయితే, అప్పటికే పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలను లోపలికి అనుమతించిన విషయాన్ని ప్రశాంత్‌రెడ్డి ప్రస్తావించారు. కాంగ్రెస్ వారికి ఒక న్యాయం, మాకో న్యాయమా? అని పోలీసులను ప్రశ్నించారు. అందరినీ బయటికి పంపుతామని, ప్రొటోకాల్ ఉన్నవారు, లబ్ధిదారులనే లోనికి పంపుతామని పోలీసులు చెప్పడంతో ప్రశాంత్‌రెడ్డి లోనికి వెళ్లారు. అయితే, ఫంక్షన్‌హాల్‌లో పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ శ్రేణులు ఉండడంతో బీఆర్ఎస్ నాయకులు లోనికి దూసుకెళ్లారు.



## తులం బంగారం ఏమైందన్నందుకు గొడవ..

ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు కల్యాణ లక్ష్మి పథకం లబ్ధిదారులకు చెక్కుతో పాటు తులం బంగారం ఇవ్వాలని ప్రభుత్వానికి తెలియజేయాలని మంత్రిని కోరారు. అలాగే, నియోజకవర్గంలో నిలిచిపోయిన 21వ ప్యాకేజీ పనులు, భీమ్‌గల్ వెజ్, నాన్ వెజ్ మార్కెట్ సహా పలు సమస్యలను మంత్రి దృష్టికి తెచ్చారు. అనంతరం జూపల్లి అరగంట సేపు ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తూ, చివర్లో తులం బంగారం ఇవ్వడానికి నిధులు లేవని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అప్పుల్లో ఉందని, రాష్ట్రాన్ని కేసీఆర్ అప్పుల కుప్పగా చేశారని ఆరోపించారు. దీంతో ఎమ్మెల్యే వేముల లేచి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో కొందరు కాంగ్రెస్ నాయకులు అల్లర్లు సృష్టించారు. ఎమ్మెల్యే వేములను దూషిస్తూ ముందుకు రావడంతో బీఆర్ఎస్ శ్రేణులు నిలువరించే క్రమంలో తోపులాట మొదలైంది.



బీఆర్ఎస్ కార్యకర్తలపై లాఠీలు ఝుళిపిస్తున్న పోలీసులు



బీఆర్ఎస్ నాయకుడిని చుట్టుముట్టిన పోలీసులు

## రెచ్చగొట్టిన కాంగ్రెస్ నేతలు..

అప్పటికి మంత్రి రాకపోవడంతో కాంగ్రెస్ నాయకులు డీజేలో రేవంత్‌రెడ్డి వ్యక్తిగత పాటలు, కాంగ్రెస్ పార్టీ పాటలు పెట్టారు. దీనిపై బీఆర్ఎస్ శ్రేణులు తిరగబడ్డారు. ప్రభుత్వ కార్యక్రమంలో పార్టీ పాటలు ఎందుకు పెడతారంటూ నిరసన తెలిపారు. దీంతో కొద్ది సేపు గందరగోళం నెలకొంది. చివరకు పోలీసులు జోక్యం చేసుకుని డీజే బంద్ చేయించారు. ఈ తరుణంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల పరస్పర నినాదాలతో అక్కడ తీవ్ర ఉద్రిక్తత నెలకొన్నది. ఇరువర్గాలు తోపులాటకు దిగడంతో పోలీసులు అందరినీ బయటికి పంపారు. ఇంతలో మంత్రి జూపల్లి రావడంతో ఇదే అదనుగా పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ శ్రేణులు లోపలకు దూరాయి. బీఆర్ఎస్ నాయకులు జూపల్లికి అడ్డువెళ్లి జై తెలంగాణ నినాదాలు చేశారు. మంత్రి జూపల్లి కలుగజేసుకుని కాంగ్రెస్ శ్రేణులు నోరెత్తవద్దని, అలాగే బీఆర్ఎస్ శ్రేణులను వారించాలని ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డిని కోరడంతో సభ మొదలైంది



కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య తోపులాట



రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న మాజీ మంత్రి వేముల, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

## రెచ్చిపోయిన పోలీసులు..

గందరగోళానికి కారకులైన కాంగ్రెస్ శ్రేణులను వదిలేసిన పోలీసులు.. బీఆర్ఎస్ నాయకులపై దాడికి దిగారు. పలువురు నాయకులను ఎత్తి బయటికి విసిరేశారు. లాఠీలతో ఇష్టమొచ్చినట్లు కొట్టారు. పోలీసులదాడుల్లో 16 మంది బీఆర్ఎస్ నాయకులకు గాయాలయ్యాయి. పలువురి ఒంటిపై బట్టలు చిరిగిపోయాయి. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో మంత్రి జూపల్లి బందోబస్తు నడుమ అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఆయన వెంట వెళ్తున్న నియోజకవర్గ ముఖ్య నాయకులు బీఆర్ఎస్ నాయకులను కుమ్మేయండంటూ ఆదేశాలిచ్చారు. దీంతో కొందరు పోలీసులు ఇష్టమొచ్చినట్లు దాడులకు తెగబడ్డారు. అనుచరులపై దాడి జరుగడంతో ఆవేదనకు లోనైన ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి కాలి నడకన ప్రధాన రహదారిపైకి వచ్చారు. పోలీసు దౌర్జన్యాన్ని నిరసిస్తూ వందలాది మంది బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి రాస్తారోకో చేశారు. రెండు గంటలకు పైగా రేవంత్‌రెడ్డికి, కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చివరికి ఆర్మూర్ ఏసీపీ వచ్చి ఘటనపై విచారణ జరిపిస్తామని, పోలీసులు ఎవరైనా అతిగా వ్యహరిస్తే చర్యలు తీసుకుంటామని చెప్పడంతో ఆందోళన విరమించారు.



బీఆర్ఎస్ నాయకులను బయటికి లాక్కెళ్తున్న పోలీసులు

భీమ్‌గల్, ఏప్రిల్ 16: భీమ్‌గల్‌లో బుధవారం నిర్వహించిన కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. చెక్కుతో పాటు ఇస్తామన్న తులం బంగారం ఏమైందని ప్రశ్నించినందుకు కాంగ్రెస్ శ్రేణులు రెచ్చిపోయారు. పోలీసులు వారికి వంత పాడుతూ బీఆర్ఎస్ శ్రేణులపై లాఠీలు ఝుళిపించారు. మంత్రి జూపల్లి, కలెక్టర్ సమక్షంలోనే మాజీ ప్రజాప్రతినిధులను టార్గెట్‌గా చేసుకుని చితగ్గొట్టారు. ఒక్కొక్కరిని పది మంది వరకు చుట్టుముట్టి చితగ్గొట్టారు. కిందపడేసి లాఠీలతో కుళ్లబొడిచారు. దుస్తులు లాగుతూ, బూట్లతో తన్నుతూ వీరంగం సృష్టించారు. కాంగ్రెస్, ఖాకీల దౌర్జన్యాన్ని నిరసిస్తూ మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి కార్యకర్తలతో కలిసి రాస్తారోకోకు దిగారు. పోలీసుల తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

## ప్రశ్నిస్తే చితకబాదడమే ప్రజాపాలనా?

**-బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి**



మోర్తాడ్, ఏప్రిల్ 16: ఇచ్చిన హామీలపై అడిగితే పోలీసులతో చితకబాదించడాన్ని ప్రజాపాలన అంటారా? అని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ప్రశ్నించారు. కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకం కింద తులం బంగారం ఎప్పుడిస్తారని మంత్రి జూపల్లిని అడిగిన బీఆర్ఎస్ కార్యకర్తలపై పోలీసులు లాఠీచార్జీ చేయడం అమానుషమని పేర్కొన్నారు. చట్టవ్యతిరేకంగా కాంగ్రెస్ కనుసన్నల్లో పనిచేస్తున్న పోలీసులు మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు. పోలీసుల లాఠీచార్జీకి గురైన కార్యకర్తలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

పోలీసుల దాష్టికాలపై ఏసీపీని నిలదీస్తున్న వేముల



## అన్ని రోజులు మీవే కావు: ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

హామీలపై ప్రశ్నిస్తే కాంగ్రెస్ నాయకులు పోలీసులతో దాడులకు తెగబడ్డారని, అందుకు బాధ్యులైన పోలీసులను వదలబోమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి హెచ్చరించారు. గాయాలపాలైన బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి రోడ్డుపై బైఠాయించిన ఆయన పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొందరు పోలీసులు కావాలని అతిగా ప్రవర్తించారని, కాంగ్రెస్ నాయకులు దగ్గరుండి తమ నేతలపై దాడులు చేయించారన్నారు. ఒక్క కాంగ్రెస్ నాయకుడికి అయినా దెబ్బలు తగిలాయా అని ప్రశ్నించారు. భీమ్‌గల్ సీఐతో మరి కొందరు పోలీసులు వ్యక్తిగతంగా తీసుకుని తమ వారిని కొట్టారన్నారు. అన్ని రోజులు ఒకేలా ఉండవని, తమ రోజంటూ ఒకటొస్తుందని అప్పుడు వడ్డీతో సహా చెల్లిస్తామని చెప్పారు. తెలంగాణ ఉద్యమ సమయంలోనూ ఇంతటి దౌర్జన్యకాండ చూడలేదన్నారు. పోలీసుల దాడిలో గాయపడిన బీఆర్ఎస్ నాయకులను స్థానిక దవాఖానకు తీసుకెళ్లి చికిత్స చేయించారు.

## లాఠీచార్జీలకు భయపడేదే లేదు..

- ఇది ప్రజాపాలన..పోలీసు పాలన!
- ఇందిరమ్మ రాజ్యంలో ప్రశ్నించడమే నేరమా?
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



మోర్తాడ్, ఏప్రిల్ 16: కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకం కింద తులం బంగారం ఏమైందని ప్రశ్నించినందుకు బీఆర్ఎస్ కార్యకర్తలను మంత్రి జూపల్లి పోలీసులను ఉసిగొల్పి లాఠీచార్జీ చేయించి తనకర్కశత్వాన్ని ప్రదర్శించారని ఎమ్మెల్సీ కవిత ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇందిరమ్మ రాజ్యంలో హామీల విషయంలో ప్రశ్నించడమే నేరమా అని భీమ్‌గల్‌లో బుధవారం చోటుచేసుకున్న సంఘటనపై ఎమ్మెల్సీ స్పందించి ఎక్స్‌లో మండిపడ్డారు. లాఠీచార్జిలకు, కాంగ్రెస్ కార్యకర్తల దాడులకు భయపడేదేలేదని స్పష్టం చేశారు. లాఠీచార్జికి పాల్పడిన పోలీసులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడికి పాల్పడిన కాంగ్రెస్ కార్యకర్తలపై కేసులు నమోదు చేయాలని డీజీపీని డిమాండ్ చేశారు.

---



గాంధారిలో 'చలో వరంగల్' పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్

# రజతోత్సవ సభకు పెద్దసంఖ్యలో తరలిరావాలి

- ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే సురేందర్ పిలుపు
- తాడ్వాయి, గాంధారిలో బీఆర్ఎస్ సన్నాహక సమావేశంలో పాల్గొన్న జాజాల

లింగంపేట/రామారెడ్డి (గాంధారి), ఏప్రిల్ 16: వరంగల్ జిల్లాలోని ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ పిలుపునిచ్చారు. బుధవారం తాడ్వాయి, గాంధారి మండల కేంద్రాల్లో నిర్వహించిన బీఆర్ఎస్ సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. తెలంగాణను సాధించిన బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్..పదేండ్లలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని తెలిపారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం కృషిచేశారని పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలే తన బలమని, ఏ కష్టం వచ్చినా తాను అండగా ఉంటానని జాజాల భరోసా ఇచ్చారు. వరంగల్‌లో నిర్వహించనున్న రజతోత్సన సభకు తరలివెళ్లడానికి ఏర్పాట్లపై నాయకులతో సమీక్ష నిర్వహించారు. గాంధారిలో స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి చలో వరంగల్ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం వాల్ పెయింటింగ్‌ను ప్రారంభించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ సాయిరెడ్డి, విండో చైర్మన్ కపిల్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ముదాం నర్సింహులు, నాయకులు నారాయణ, రాంరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ధర్మారెడ్డి, రాజాగౌడ్, రమేశ్, మల్లారెడ్డి, మంగారెడ్డి, సాయిరెడ్డి, తాజుద్దీన్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల పురోగతికి చర్యలు తీసుకోండి

- గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన పనులను పూర్తి చేయించండి
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లికి మాజీ మంత్రి వేముల వినతి



మంత్రి జూపల్లికి వినతిపత్రాన్ని అందజేస్తున్న మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

మోర్తాడ్, ఏప్రిల్ 16: బాల్కొండ నియోజకవర్గంలో గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన ముఖ్యమైన అభివృద్ధి పనుల పురోగతిపై దృష్టిసారించి, పూర్తిచేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన భీమ్‌గల్‌లో కల్యాణలక్ష్మి,షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేయడానికి బుధవారం వచ్చిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుకు వినతిపత్రం అందజేశారు. భీమ్‌గల్‌లో వెజ్, నాన్‌వెజ్ మార్కెట్‌తోపాటు వంద పడకల దవాఖాన భవన నిర్మాణ పనులను పూర్తిచేయాలని కోరారు. చిట్టాపూర్-సుర్బిర్యాల్-ఫతేపూర్ లిఫ్ట్ పనులను పూర్తిచేయించాలని కోరారు. ఎస్సారెస్పీ ప్రాజెక్ట్ బ్యాక్‌షోర్‌లో ఐలాండ్స్, చూడదగ్గ ప్రదేశాలు ఉన్నాయని, ఈప్రాంతాన్ని టూరిజం స్పాట్‌గా ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతిపాదనలు సిద్ధంచేసి ఇరిగేషన్ ల్యాండ్స్ టూరిజం వారికి బదిలీ కూడా చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ఈ ప్రతిపాదన ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నదని పేర్కొన్నారు. అలాగే ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ పైభాగంలో బాసర సరస్వతీ పుణ్యక్షేత్రం ఉందని, ఎస్సారెస్పీ నుంచి బాసర వరకు టూరిజం అభివృద్ధి చేసేలా బోటు సౌకర్యాన్ని కల్పించాలన్నారు. నింబాచల లక్ష్మీనర్సింహా ఆలయ అభివృద్ధి కోసం ఎండోమెంట్, టూరిజం ప్రాజెక్ట్ కింద రూ.25కోట్లు మంజూరు చేయాలని విన్నవించారు.



ధాన్యం కుప్పల మధ్య నిలిచిన నీటిని తొలగిస్తున్న రైతులు

# రైతన్నను ఆగం చేసిన వాన

- లింగంపేట మండలంలో అకాల వర్షం
- కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం కుప్పలు



కోమట్‌పల్లిలో వడగండ్లను చూపుతున్న ఓ రైతు

లింగంపేట, ఏప్రిల్ 16: కొన్నిరోజులుగా అకాల వర్షాలు అన్నదాతను ఆందోళనకు గురిచేస్తున్నాయి. మండలంలోని కోమట్‌పల్లి, పోతాయిపల్లి గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో పాటు ఈదురుగాలులతో అరగంటపాటు భారీ వర్షం కురిసింది. దీంతో కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దయ్యింది. చేతికి వచ్చిన పంటను అమ్ముకునే సమయంలో అకాల వర్షాలకు తడిసిపోవడంతో రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. వర్షానికి తోడు వడగండ్లు కురవడంతో గింజలు రాలిపోతున్నాయిన ఆవేదన వ్యక్తంచేశారు. కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినా కాంటా చేయకపోవడంతో ధాన్యం కుప్పలు పేరుకుపోతున్నాయని తెలిపారు. పోతాయిపల్లి గ్రామంలో ఆరబెట్టిన ధాన్యం వరద నీటిలో కొట్టుకుపోగా, కాపాడుకోవడానికి నానా అవస్థలు పడినట్లు రైతులు, మహిళలు తెలిపారు. అధికారులు వెంటనే తూకం ప్రారంభించాలని రైతులు కోరారు.